# నీటి సమస్య పరిష్కారంలో విజయ్ సేవలు భేష్



**ఉద్యమ కెరటం, గుడిహత్నూర్:** వేసవి కాలం దృష్ట్యా ప్రతి గ్రామంలో మంచినీటి కొరత ఏర్పడుతున్న తరుణంలో గుడిహత్నూర్ పట్టణ కేంద్రానికి నీటి సౌకర్యం కల్పించడంలో అహర్నిశలు కృషి చేస్తూ అందరికీ అందుబాటులో ఉంటూ సేవలు అందిస్తున్న శ్రీపతివార్ విజయ్‌కు గ్రామ సర్పంచ్ ఆడే శీలతో పాటు గ్రామస్తులు ప్రశంసలు కురిపిస్తున్నారు. ఈ సందర్భంగా విజయ్ మాట్లాడుతూ పలు రకాల లీకేజీలు, చేతి పంపుల మరమ్మత్తులు, నల్లాల మరమ్మత్తులు చేపడుతూ ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రజల అవసరాల దృష్ట్యా పనిభారం ఎక్కువైనా మంచినీటి సౌకర్యం కల్పించడంలో తమవంతు కృషి కొనసాగిస్తున్నామని చెప్పారు. అలాగే మారుమూల గ్రామాల సిబ్బంది కూడా ప్రజలకు తాగునీటి సౌకర్యం అందించేందుకు కృషి చేయాలని సూచించారు.

# నాగోబాగూడా సీసీ రోడ్లకు భూమిపూజ



**ఉద్యమ కెరటం, జైనూర్:** మండలంలోని పానాపటార్ గ్రామపంచాయతీ పరిధిలోని నాగోబాగూడా గ్రామంలో ఎంఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ.4 లక్షల వ్యయంతో చేపట్టనున్న అంతర్గత సీసీ రోడ్డు పనులకు మంగళవారం భూమిపూజ నిర్వహించారు. ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవా లక్ష్మీ ఆదేశాల మేరకు గ్రామ సర్పంచ్ ఆత్రం తులసి భూమిపూజ చేసి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామంలో రోడ్డు సదుపాయం మెరుగుపడుతుందని గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఆత్రం భీంరావ్, కార్యదర్శి జాడి కైలాష్, గ్రామస్థులు మడావి ముత్తు, జంగుబాయి విష్ణు, లక్ష్మణ్, దత్తారాం, రాము శంకర్ కొలాం తదితరులు పాల్గొన్నారు.

# తహాశీల్దార్ బానోత్ రమేష్‌కు ఘన సన్మానం



**ఉద్యమ కెరటం, భీంపూర్:** మండలానికి నూతన తహాశీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించిన బానోత్ రమేష్‌ను మండల కాంగ్రెస్ నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పిప్పల్ కోటి సర్పంచ్ దాసరి రమేశ్ మాట్లాడుతూ మండల ప్రజల సమస్యల పరిష్కారానికి తహాశీల్దార్ కృషి చేయాలని కోరారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు నేరుగా ప్రజలకు చేరేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే ప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించే కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అశోక్, సుదర్శన్, దేవారెడ్డి, నరేష్, కరీం తదితరులు పాల్గొన్నారు.

# పశువులకు గాలికుంటు టీకాలు వేయించాలి



**ఉద్యమ కెరటం, జైనూర్:** పశుపోషకులు, రైతులు తమ పశువులకు గాలికుంటు వ్యాధి టీకాలు తప్పనిసరిగా వేయించాలని ప్రభుత్వ పశువైద్య ఆసుపత్రి వెటర్నరీ అసిస్టెంట్ రాథోడ్ సికిందర్ అన్నారు. మండలంలోని దుబ్బగూడ గ్రామంలో మంగళవారం గాలికుంటు వ్యాధి నివారణ టీకాల శిబిరాన్ని నిర్వహించారు. మండల పశువైద్య అధికారి మురళీకృష్ణ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా శిబిరంలో మొత్తం 253 పశువులకు టీకాలు వేసినట్లు అధికారులు తెలిపారు. పశువుల ఆరోగ్యం పరిరక్షణపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది ప్రకాష్, రాజన్న, మంగిలాల్, రైతులు పాల్గొన్నారు.

# వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలి

**• జిల్లా కలెక్టర్ రాజర్షిషా**



**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు. మంగళవారం కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ కార్యక్రమంలో భాగంగా తాంసి మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, మిత్ర ఎన్జీఓ సహకారంతో ఏర్పాటు చేసిన రూ.2 లక్షల విలువైన నూతన వైద్య పరికరాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలోని విభాగాలను పరిశీలించి, రోగులకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. లేబర్ రూమ్‌కు అవసరమైన టేబుల్స్, స్ట్రెచర్లు, డిజిటల్ బీపీ యంత్రాలు, రోగుల భద్రత కోసం సీసీటీవీ కెమెరాలను అందించిన ఎస్బీఐ అధికారులకు, మిత్ర ఎన్జీఓ ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రజలు చిన్నపాటి అనారోగ్య సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా సమీప ఆరోగ్య కేంద్రాలను సంప్రదించాలని సూచించారు. సకాలంలో వైద్యం చేయించుకోవడం ద్వారా పెద్ద వ్యాధుల బారిన పడకుండా ఉండవచ్చన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో డాక్టర్లు సిబ్బంది ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి సేవలు అందిస్తున్నారని, ప్రజలు ప్రభుత్వ వైద్య వ్యవస్థపై నమ్మకం పెంచుకోవాలని కోరారు. మహిళల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారిస్తూ జిల్లాలో ప్రతి మహిళకు 'హెల్త్ ప్రొఫైల్' రూపొందించనున్నట్లు తెలిపారు. పీహెచ్‌సీ, సబ్ సెంటర్ల స్థాయిలో ప్రతిరోజూ 50 మంది మహిళలకు 30 రకాల వైద్య పరీక్షలు నిర్వహించి వారి ఆరోగ్య వివరాలను నమోదు చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్బీఐ రీజనల్ మేనేజర్ రామచంద్రరావు, లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ ఉత్పల్ కుమార్, డీఎంహెచ్ఓ నరేందర్ రాథోడ్, తహాశీల్దార్ లక్ష్మీ, ఎంపీడీఓ మోహన్ రెడ్డి, తాంసి బ్రాంచ్ మేనేజర్ శైలేష్, మైత్రి హోలిస్టిక్ హెల్త్ సొసైటీ లక్ష్మి రెడ్డి, డాక్టర్ శ్రావ్యవాణి, సర్పంచ్ సంతోష్ రెడ్డి, ఉప సర్పంచ్ గంగారెడ్డి, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# పశువుల సంరక్షణ కోసమే టీకాల కార్యక్రమం

**• జిల్లా కలెక్టర్ రాజర్షిషా**



**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** పశువుల సంరక్షణే ధ్యేయంగా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా సామూహిక ఉచిత గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమాన్ని చేపట్టిందని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు. ప్రజాపాలన–ప్రగతి ప్రణాళికలో భాగంగా మంగళవారం తలమడుగు మండల కేంద్రంలోని పశువైద్యశాలలో 8వ జాతీయ ఉచిత గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమాన్ని, అవగాహన కల్పించే ప్రచార రథాన్ని జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా పశువులకు టీకాలు వేసే ప్రక్రియను స్వయంగా పరిశీలించి, కార్యాలయ ఆవరణలో మొక్కను నాటి నీరుపోశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఉన్న 2,90,000 ఆవులు, 48,000 గేదెలకు నెలరోజుల పాటు సాగే ప్రత్యేక కార్యక్రమంలో టీకాలు వేయనున్నట్లు తెలిపారు. గాలికుంటు వ్యాధి కారణంగా పాడి రైతులు ఆర్థికంగా నష్టపోయే ప్రమాదం ఉందని, ప్రతి రైతు ఈ అవకాశాన్ని వినియోగించుకుని తమ పశువులకు ఉచితంగా టీకాలు వేయించుకోవాలని సూచించారు. ప్రచార రథం ద్వారా గ్రామాల్లో రైతులకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పిస్తామని పేర్కొన్నారు. అనంతరం పశువైద్యశాల రికార్డులను పరిశీలించి, అందుబాటులో ఉన్న మందుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. రైతులకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి సేవలు అందించాలని అధికారులను ఆదేశించారు. ఇదిలా ఉండగా గ్రామ గ్రంథాలయం, గ్రామపంచాయతీ కార్యాలయాన్ని సందర్శించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి రామారావు, డాక్టర్ లావణ్య, తహాశీల్దార్ రాజ్ మోహన్, రైతులు, గ్రామస్తులు, సిబ్బంది పాల్గొన్నారు.

# జాతీయ స్థాయి బ్యాడ్మింటన్ పోటీల్లో గగనశ్రీకి 4వ స్థానం

**• పాఠశాలలో ఘన సత్కారం**



**ఉద్యమ కెరటం, సత్తుపల్లి:** ఒరిస్సా రాష్ట్రంలోని భువనేశ్వర్‌లో ఇటీవల నిర్వహించిన జాతీయ స్థాయి బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో అండర్–17 విభాగంలో కొలపనేని గగనశ్రీ 4వ స్థానం సాధించి ప్రతిభ చాటింది. మంగళవారం ఆమె తాను పదో తరగతి పూర్తి చేసుకున్న విశ్వశాంతి విద్యాలయాన్ని సందర్శించగా, పాఠశాల ప్రిన్సిపల్ పసుపులేటి నాగేశ్వ రరావు ఆధ్వర్యంలో ఉపా ధ్యాయులు, విద్యార్థులు కలిసి ఘనంగా సత్కరించారు. గగనశ్రీ గతంలో ఆంధ్ర ప్రదేశ్‌లోని అనంతపురంలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో అండర్–17 విభాగంలో సింగిల్స్, మిక్స్డ డబుల్స్లో రెండు స్వర్ణ పతకాలు సాధించి జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించింది. అనంతరం భువనేశ్వర్‌లో జరిగిన ఆల్ ఇండియా పోటీలలో 4వ స్థానం దక్కించుకుంది. ఈ సందర్భంగా గగనశ్రీ మాట్లాడుతూ భవిష్యత్తులో అంతర్జాతీయ స్థాయిలో రాణించాలనే లక్ష్యంతో నిరంతరం సాధన చేస్తున్నానని తెలిపారు. ఈ కార్యక్రమంలో గగనశ్రీ తండ్రి అనిల్ కుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# మొఫెడ్ ఈ-బైక్ పథకంలో తక్కువ కేటాయింపులు

**• ఫకీర్ వర్గానికి నిరాశ**



**ఉద్యమ కెరటం, సిరిసిల్ల:** రాజన్న సిరిసిల్ల జిల్లాలో మొఫెడ్ ఈ–బైక్ పథకం కింద తక్కువ కేటాయింపులు జరగడంతో ఫకీర్ వర్గానికి చెందిన అభ్యర్థుల్లో నిరాశ నెలకొంది. ముస్లిం సమాజంలో వెనుకబడిన వర్గాలైన దూదేకుల, ఫకీర్ వర్గాల అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం ఈ పథకాన్ని ప్రవేశపెట్టింది. జిల్లాలో ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు స్వీకరించగా, దూదేకుల వర్గం నుంచి సుమారు 100–110 మంది, ఫకీర్ వర్గం నుంచి 90–100 మంది వరకు దరఖాస్తు చేసుకున్నారు. మొత్తం సుమారు 230 మంది ఈ పథకం కోసం ఆశగా ఎదురుచూశారు. మంగళవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ గరీమా అగర్వాల్ చేతుల మీదుగా డ్రా నిర్వహించి లబ్ధిదారులను ఎంపిక చేశారు. అయితే జిల్లాకు కేవలం 5 యూనిట్లు మాత్రమే కేటాయించగా, ఫకీర్ వర్గానికి చెందిన ఒక్కరికి కూడా అవకాశం దక్కకపోవడం పట్ల అసంతృప్తి వ్యక్తమవుతోంది. ఈ విషయంపై ఫకీర్ సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ షబ్బీర్ మాట్లాడుతూ ఫకీర్ వర్గానికి సమాన అవకాశాలు కల్పించాలన్నారు. యూనిట్ల సంఖ్యను పెంచి వెనుకబడిన వర్గాలకు ప్రాధాన్యత ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు.

# మస్జీద్-ఎ-ఖుబ కమిటీ అధ్యక్షుడిగా అహ్మాద్



**ఉద్యమ కెరటం, పాల్వంచ:** కామారెడ్డి జిల్లా పాల్వంచ మండల కేంద్రంలోని మస్జీద్–ఎ–ఖుబ మస్జీద్ కమిటీకి నూతన అధ్యక్షుడిగా మహమ్మద్ అహ్మాద్ ఎన్నికయ్యారు. గతంలో కూడా అధ్యక్షుడిగా సేవలందించిన ఆయనకు కమిటీ సభ్యులు మరోసారి బాధ్యతలు అప్పగించారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు, స్థానిక ముస్లిం సోదరులు మహమ్మద్ అహ్మాద్‌కు అభినందనలు తెలిపారు. మస్జీద్ అభివృద్ధి, మతపరమైన కార్యక్రమాల నిర్వహణలో ఆయన అనుభవం కమిటీకి ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా మహమ్మద్ అహ్మాద్ మాట్లాడుతూ మస్జీద్ అభివృద్ధికి కృషి చేస్తానని, అందరి సహకారంతో సేవలను మరింత విస్తరించేందుకు ప్రయత్నిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో మస్జీద్ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, ముస్లిం సోదరులు పాల్గొన్నారు.

# బాలికలకు హెచ్‌పివి వ్యాక్సిన్ అందించాలి





**• జిల్లా కలెక్టర్ హరిత**

**ఉద్యమ కెరటం, తిర్యాని:** జిల్లాలో 9 నుంచి 14 సంవత్సరాల లోపు గల బాలికలందరికీ హెచ్‌పివి వ్యాక్సిన్ అందించాలని జిల్లా కలెక్టర్ కె.హరిత సూచించారు. మంగళవారం తిర్యాణి మండల కేంద్రంలోని చింతపల్లి కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను నీతి అయోగ్ కేంద్ర ప్రతినిధి అశ్ల శర్మతో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలోని ఆపరేషన్ థియేటర్, రోగుల వార్డులు, మందుల నిల్వ గది, ప్రసూతి విభాగాన్ని పరిశీలించి నెలలో జరుగుతున్న ప్రసవాల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రికి వచ్చే ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని, తాగునీటి కోసం ఏర్పాటు చేసిన ఆర్‌ఓ ప్లాంట్‌ను వెంటనే మరమ్మతులు చేసి వినియోగంలోకి తీసుకురావాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రజాపాలన–ప్రగతి ప్రణాళికలో భా గంగా 9 నుంచి 14 ఏళ్ల బాలికలకు హెచ్‌పివి వ్యాక్సిన్ అందించడం ద్వారా గర్భాశయ క్యాన్సర్ వంటి వ్యాధులను నివారించవచ్చని తెలిపారు. అనంతరం మండలంలోని విజయనగరం కాలనీలో నిర్మిస్తున్న జంగుబాయి మండల సమాఖ్య భవన నిర్మాణ పనులను పరిశీలించారు. పనులు సుమారు 90 శాతం పూర్తయ్యాయని, మిగిలిన తలు పులు, కిటికీలు అమర్చడం, విద్యుత్ సౌకర్యం కల్పించడం త్వరగా పూర్తి చేసి భవనాన్ని ప్రారం భానికి సిద్ధం చేయాలని సూచించారు. ఈ భవనం మహిళా సంఘాల సమావేశాలకు ఉపయో గపడు తుందని తెలిపారు. ఈ సందర్భంగా మండల సమాఖ్య సభ్యులు జిల్లా కలెక్టర్, నీతి అయోగ్ ప్రతినిధిని శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి రమాదేవి, తిర్యాణి ఎంపీడీఓ వేముల మల్లేష్, ఏపీఎం శ్రీనివాస్, వైద్యులు, సిబ్బంది, సంపూర్ణత అభియాన్ జిల్లా సమన్వయకర్త బాలరాజు, మండల సమాఖ్య సభ్యులు, రైతులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# సోదర భావంతో మెదలాలి





**• రంజాన్, జాతరల సందర్భంగా పరిశుభ్రత చర్యలు**

**ఉద్యమ కెరటం, హత్నూర:** సమాజంలో అన్ని వర్గాల ప్రజలు సోదర భావంతో కలిసి మెలిసి ఉండాలని హత్నూర గ్రామ సర్పంచ్ నల్లొల్ల ఎల్లయ్య పేర్కొన్నారు. రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని మంగళవారం మండల కేంద్రమైన హత్నూర గ్రామంలోని ఈద్గా వద్ద పరిశుభ్రత కార్యక్రమాలు నిర్వహించారు. ఈద్–ఉల్–ఫితర్ నమాజ్ కోసం వచ్చే ముస్లిం సోదరులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా రహదారి ఇరువైపులా ఉన్న పిచ్చి మొక్కలను జేసీబీ సహాయంతో తొలగించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గంగా–జమునా తహెజీబ్‌ను ప్రతిబింబించేలా అన్ని మతాల ప్రజలు కలిసిమెలిసి ఉండాలని సూచించారు. రంజాన్ పవిత్ర మాసం సమరస్యానికి, సోదర భావానికి ప్రతీకగా నిలుస్తుందని, ముస్లింలు ఉపవాస దీక్షలు పాటిస్తూ దానధర్మాలు చేయడం ద్వారా సమాజంలో ఐక్యతను చాటుతారని తెలిపారు. ఇఫ్తార్ విందుల్లో అన్ని మతాల వారు పాల్గొనడం సామరస్యానికి నిదర్శనమని అన్నారు. అదేవిధంగా ఈనెల 19న నిర్వహించే లక్ష్మీనరసింహ స్వామి జాతరను దృష్టిలో ఉంచుకుని ఆలయానికి వెళ్లే మార్గాల్లో కూడా ముందస్తుగా పిచ్చి మొక్కలను తొలగించినట్లు తెలిపారు. గ్రామ అభివృద్ధికి కుల, మత, రాజకీయాలకు అతీతంగా అందరూ కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల మైనార్టీ నాయకులు, మాజీ ఉప సర్పంచ్ మేరాజ్, వార్డు సభ్యులు నాగేష్, నాయకులు నీరుడు నర్సింలు, అవేస్, షరీఫ్, పండుగ శేఖర్, కృష్ణ, కొండగళ్ల రవి, నల్లొల్ల కృష్ణ, మాలయ్య తదితరులు పాల్గొన్నారు.

# ముస్లిం పేదల పథకంలో అన్యాయం

**• ఫకీర్ వర్గానికి న్యాయం చేయాలన్న డిమాండ్**



**ఉద్యమ కెరటం, సిరిసిల్ల:** రాష్ట్ర ప్రభుత్వం ముస్లిం నిరుపేదలకు ఆర్థికంగా అండగా నిలిచేందుకు ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన "రేవంత్ అన్నకా సహారా మిస్కిన్ కె లియే" మోపెడ్ ఈ–బైక్ పథకం అమలుపై అసంతృప్తి వ్యక్తమవుతోంది. పేద ముస్లిం కుటుంబాల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని ఈ పథకం ప్రారంభించినప్పటికీ, అర్హులైన ముస్లిం దూదేకుల, ఫకీర్ వర్గాలకు న్యాయం జరుగడం లేదని బాధితులు ఆరోపిస్తున్నారు. ముఖ్యంగా ముస్లిం సమాజంలో అత్యంత వెనుకబడిన వర్గాలైన దూదేకుల, ఫకీర్ వర్గాలకు తగిన ప్రాధాన్యం లభించలేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రాజన్న సిరిసిల్ల జిల్లాలో సుమారు 230 మంది ఈ పథకానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోగా, జిల్లా కలెక్ట ర్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన డ్రా విధానంలో కేవలం ఐదుగురిని మాత్రమే ఎంపిక చేయడం వివాదాస్పదంగా మారింది. ఈ ఎంపిక విధానంపై స్థానిక ముస్లిం సంఘాలు, ప్రజాప్రతినిధులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అత్యంత పేదరికంలో జీవిస్తున్న ఫకీర్ వర్గానికి సరైన అవకాశాలు కల్పించకపోవడం బాధాకరమని పేర్కొంటున్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర మైనారిటీ హక్కుల పోరాట సమితి జిల్లా కన్వీనర్ హమీద్ మాట్లాడుతూ ఇంత పెద్ద సంఖ్యలో దరఖాస్తులు వచ్చినప్పటికీ కేవలం ఐదుగురినే ఎంపిక చేయడం అన్యాయమని అన్నారు. నిజంగా అవసరమైన పేదలకు ఈ పథకం చేరడం లేదని, ప్రభుత్వం వెంటనే స్పందించి ఎంపిక ప్రక్రియను పునఃసమీక్షించాని డిమాండ్ చేశారు. అదేవిధంగా పథకం అమలులో పారదర్శకత పెంచాలని, ఫకీర్, దూదేకుల వర్గాలకు ప్రత్యేక కోటా కల్పించాలని, అర్హులైన ప్రతి పేద కుటుంబానికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు. మంచి ఉద్దేశంతో ప్రారంభించిన ఈ పథకం అమలులో లోపాలు ఉన్నాయని స్పష్టమవుతుండగా, వెంటనే చర్యలు తీసుకుని పేద ముస్లిం వర్గాలకు న్యాయం చేయాలని ప్రజలు కోరుతున్నారు.

# అంత్యక్రియల్లో భావోద్వేగం

**• పాడె మోసిన డీసీసీ అధ్యక్షులు నరేష్ జాదవ్**



**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** ఖానాపూర్ మాజీ ఎమ్మెల్యే అజ్మీర గోవింద్ నాయక్ అంత్యక్రియలు మంగళవారం భావోద్వేగ వాతావరణంలో జరిగాయి. ఈ సందర్భంగా డీసీసీ అధ్యక్షులు నరేష్ జాదవ్ పాడె మోసి ఆయనకు తుదివిదాయ్ పలకడం అక్కడి ప్రజలను మరింత భావోద్వేగానికి గురిచేసింది. ముందుగా గోవింద్ నాయక్ భౌతిక కాయానికి పుష్పాంజలి ఘటించి నివాళులు అర్పించారు. గోవింద్ నాయక్ ప్రజాసేవలో ఎల్లప్పుడూ ముందుండే నిజమైన ప్రజానాయకుడని డీసీసీ అధ్యక్షులు నరేష్ జాదవ్ కొనియాడారు. ఖానాపూర్ నియోజకవర్గ అభివృద్ధికి ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. ఈ విషాద సమయంలో గోవింద్ నాయక్ కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ, వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. ఆయన సేవలను స్మరించుకుంటూ ప్రజలు ఎప్పటికీ గుర్తుంచుకుంటారని, ఆయన ప్రజాసేవా స్ఫూర్తి అందరికీ ఆదర్శంగా నిలుస్తుందని తెలిపారు. అంతిమయాత్రలో పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఘనంగా షబ్-ఏ-ఖదర్ వేడుకలు



**ఉద్యమ కెరటం, గంభీరావుపేట:** గంభీరావుపేట మండలం నర్మాల గ్రామంలోని మస్జీద్–ఏ–బిల్ ఖీస్ జహాన్‌లో పవిత్రమైన షబ్–ఏ–ఖదర్ వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ముస్లిం కమిటీ అధ్యక్షుడు షేక్ షబ్బీర్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపట్టారు. ఇషా నమాజ్ అనంతరం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి, ఖురాన్ పఠనం, హమ్ద్–నాత్ మహఫిల్ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా హాఫిజ్ మహమ్మద్ వసి ఉల్లాహ్ షబ్–ఏ–ఖదర్ ప్రాముఖ్యతపై ప్రసంగించారు. పవిత్ర రాత్రి సందర్భంగా మస్జీద్ ప్రాంగణం ఆధ్యాత్మిక వాతావరణంతో నిండిపోయింది. భక్తులు శాంతి, ఐక్యత, సౌభ్రాతృత్వం కోసం ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో మస్జీద్ ఇమామ్ మహమ్మద్ తాలీం, కమిటీ ఉపాధ్యక్షుడు ఆసిఫ్, కోశాధికారి సమీర్, సభ్యులు మహమ్మద్ ఖాసీం, హెదుల్ హుస్సేన్, అహ్మద్, అబ్దుల్ సలాం, బాబా, రహీం, వలియుల్లాహ్, సయుఫ్, జహీర్ తదితరులు పాల్గొన్నారు.

## గాలికుంటు టీకాల కార్యక్రమాన్ని పరిశీలించిన కలెక్టర్

**ఉద్యమ కెరటం, తిర్యాణి:** తిర్యాణి గ్రామ పంచాయతీలో నిర్వహించిన గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ కె.హరిత మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా రైతులు టీకాల కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని, మండలంలోని అన్ని గ్రామాల్లో పశువులకు టీకాలు వేయాలని అధికారులకు సూచించారు. తిర్యాణి గ్రామంలో మొత్తం 474 పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేసినట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో నీతి ఆయోగ్ యువ ప్రొఫెషనల్ అధికారి అష్నా శర్మ, జిల్లా గిరిజనాభివృద్ధి అధికారి రమాదేవి, ఎంపీడీఓ వేముల మల్లేష్, ఉప సర్పంచ్ చేని కుమార్, మండల పశువైద్య అధికారి ఎస్.సాగర్, సిబ్బంది సురేష్, మనోహర్, రాకేష్, సంతోష్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు

## పశు పోషణపై రైతులు దృష్టి సారించాలి



**ఉద్యమ కెరటం, నేరడిగొండ:** రైతులు వ్యవసాయంతో పాటు పశు పోషణపై ప్రత్యేక దృష్టి సారించాలని వడూర్ గ్రామ సర్పంచ్ ఆ డెపు శ్రీకాంత్ అన్నారు. మండలంలోని వడూర్ గ్రామంలో పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో మంగళవారం పశువులకు ఉచిత సామూహిక గాలి కుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ పశువులకు సోకే వ్యాధుల పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని, సమయానికి టీకాలు వేయించడం, సరైన వైద్య చికిత్సలు అందించడం ద్వారా పశువులను రక్షించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పశువైద్యాధికారి రాథోడ్ జీవన్, రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## 20న ప్రత్యేక వైద్య శిబిరం

**ఉద్యమ కెరటం, తాండూర్:** తాండూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఈనెల 20న ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు పీహెచ్సీ వైద్యురాలు డాక్ట ర్ఝూన్సీ తెలిపారు. శుక్రవారం జరిగే ఈ శిబిరంలో జనరల్ మెడిసిన్, గైనకాలజీ, పేడియాట్రిక్, ఆప్తాల్మాలజీ, డెంటల్, ఆర్థోపెడిక్స్ వంటి విభాగాల వైద్య నిపుణులు సేవలు అందించనున్నట్లు పేర్కొన్నారు. మండల ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకుని వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. శిబిరానికి వచ్చే వారు ఆధార్ కార్డు, సెల్ ఫోన్ తీసుకురావాలని తెలిపారు.

## నవోదయ ఫలితాల్లో వెంకటాపురం విద్యార్థిని ప్రతిభ



**ఉద్యమ కెరటం, వేంసూరు:** ఇటీవల విడుదలైన జవహర్ నవోదయ విద్యాలయ ప్రవేశ పరీక్ష ఫలితాల్లో వేంసూరు మండలం వెంకటాపురం గ్రామానికి చెందిన చల్లపల్లి నిత్యశ్రీ ప్రతిభ కనబర్చింది. పాలేరు నవోదయ పాఠశాలలో సీటు సాధించడమే కాకుండా, ఖమ్మం జిల్లా స్థాయిలో 25వ ర్యాంక్ను కైవసం చేసుకుని అందరి ప్రశంసలు అందుకుంది. నిత్యశ్రీ తన ఐదో తరగతి వరకు స్థానిక ఉశోదయ పబ్లిక్ స్కూల్‌లో విద్యను అభ్యసించింది. గ్రామీణ ప్రాంతానికి చెందిన విద్యార్థిని జిల్లా స్థాయిలో మంచి ర్యాంక్ సాధించి నవోదయకు ఎంపిక కావడంతో గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు అభినందించారు. ఆమె విజయం ఇతర విద్యార్థులకు ఆదర్శంగా నిలుస్తుందని పేర్కొన్నారు.

# చేతిపంపు మరమ్మత్తులు చేయించిన సర్పంచ్



**ఉద్యమ కెరటం, కౌటాల:** మండలంలోని తాటినగర్ గ్రామంలో చేతిపంపు చెడిపోవడంతో గ్రామంలో మంచినీటి సమస్య తలెత్తింది. దీంతో నీటి కోసం గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయాన్ని గ్రామస్తులు సర్పంచ్ కత్మర్ అనీల్‌కు తెలియజేయగా, ఆయన వెంటనే స్పందించి ఉప సర్పంచ్ సజన్‌తో కలిసి గ్రామానికి చేరుకున్నారు. సమస్యను పరిశీలించి వెంటనే చేతిపంపు మరమ్మత్తులు చేయించారు. దీంతో గ్రామంలో నెలకొన్న నీటి సమస్య పూర్తిగా పరిష్కారమైంది. తక్షణ చర్యలు తీసుకుని సమస్యను పరిష్కరించిన సర్పంచ్ కత్మర్ అనీల్, ఉప సర్పంచ్ సజన్‌లకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

# భక్తి శ్రద్ధలతో హరోబోల్ కీర్తనలు



**ఉద్యమ కెరటం, కాగజ్‌నగర్:** కాగజ్‌నగర్ మండలం నజరుల్‌నగర్ విలేజ్ నంబర్ 1లో బెంగాలీ సోదరులు మంగళవారం భక్తి శ్రద్ధలతో హరోబోల్ కీర్తన, గంగాస్నానం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీ జెడ్పీ చైర్మన్ కోనేరు కృష్ణరావు ముఖ్యతిథిగా హాజరై భక్తులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రభాత వేళల్లోనే భక్తులు గంగా స్నానం ఆచరించి, హరినామ స్మరణతో కీర్తనలు గానం చేశారు. హరోబోల్ నినాదాలతో ఆ ప్రాంతం అంతా ఆధ్యాత్మిక వాతావరణంతో మార్మోగింది. ఈ సందర్భంగా కోనేరు కృష్ణరావు మాట్లాడుతూ ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు సమాజంలో ఐక్యతను పెంపొందిస్తాయని, మన సంస్కృతి, సాంప్రదాయాలను కాపాడుకోవడంలో కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు. అనంతరం ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో గ్రామస్థులు, పరిసర ప్రాంతాల నుంచి భక్తులు పాల్గొని ప్రసాదాన్ని స్వీకరించారు.

# పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత



**ఉద్యమ కెరటం, గుడిహత్నూర్:** పరిసరాల పరిశుభ్రత మన అందరి బాధ్యత అని సర్పంచ్ ఆడే శీల అన్నారు. ప్రజాపాలన– ప్రగతి ప్రణాళికలో భాగంగా మంగళవారం గుడిహత్నూర్ గ్రామంలో పరిశుభ్రత కార్యక్రమాలు చేపట్టారు. గ్రామంలో చెత్త సేకరణ నిర్వహించి, నాళాల పరిశుభ్రత పనులు జరిపారు. గ్రామస్తులు చెత్తను పారవేయడానికి కేటాయించిన వాహనాలను తప్పనిసరిగా వినియోగించాలని సూచించారు. నాళాల్లో చెత్త వేయకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, అలాంటి ఇళ్లను గుర్తించి అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. తడి, పొడి చెత్తను వేర్వేరు బుట్టల్లో వేయడం ద్వారా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచవచ్చని పేర్కొన్నారు. ఈ విధానంతో దోమల పెరుగుదలను కూడా కొంతవరకు నియంత్రించవచ్చని తెలిపారు. పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని, గ్రామాన్ని శుభ్రంగా ఉంచడంలో అందరూ భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు.

# బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా కూకలకుంట రవి



**ఉద్యమ కెరటం, సత్తుపల్లి:** సత్తుపల్లి బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా సీనియర్ న్యాయవాది కూకలకుంట రవి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. జనరల్ సెక్రటరీగా సాధు కృష్ణయ్య, జాయింట్ సెక్రటరీగా వంకదారు రామకృష్ణ, కోశాధికారిగా కొప్పుల కేశవరెడ్డి, లైబ్రరీ సెక్రటరీగా నల్లగట్ల విజయకుమార్ ఎన్నికయ్యారు. అలాగే స్పోర్ట్స్ గేమ్స్ ప్రతినిధిగా జేవీ నరేంద్ర, మహిళా ప్రతినిధిగా ఎస్కే జీనత్ హస్సీనా, ఈసీ మెంబర్లుగా గుంట్రు శ్రీనివాసరావు, మోదుగు నరేష్‌లను ఎంపిక చేశారు. తెలంగాణ బార్ అసోసియేషన్ విడుదల చేసిన ఎన్నికల షెడ్యూల్ మేరకు ఈనెల 9 నుంచి 11 వరకు నామినేషన్ ప్రక్రియ నిర్వహించగా, 16న నామినేషన్ల ఉపసంహరణ అనంతరం నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎంపికైంది. ఎన్నికల అధికారిగా ఎస్.లక్ష్మణరావు వ్యవహరించారు. కాగా ఉపాధ్యక్ష పదవికి ఎన్నిక ఈనెల 26న నిర్వహించనున్నారు. ఏప్రిల్ 1 నుంచి ఏడాది పాటు ఈ నూతన కార్యవర్గం బాధ్యతలు నిర్వహించనుంది.

# ప్రకృతి వ్యవసాయ సాగుతో మరింత ఆరోగ్యం







• రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

**ఉద్యమ కెరటం, మంచిర్యాల:** ప్రకృతి వ్యవసాయ సాగుతో ప్రజల జీవన ప్రమాణాన్ని మరింత పెంపొందించవచ్చని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల్లో జాతీయ మిషన్ ఫర్ ప్రకృతి వ్యవసాయంపై నిర్వహించిన ఒకరోజు శిక్షణ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ రంగానికి మొదటి ప్రాధాన్యత ఇస్తూ రైతుల సంక్షేమం కోసం కృషి చేస్తుందన్నారు. ప్రకృతి వ్యవసాయ సాగులో సహజ సిద్ధమైన సేంద్రియ ఎరువులు, సాగు పద్ధతులు అవలంభించడం ద్వారా ఆరోగ్యకరమైన పంట ఉత్పత్తులు సాధించవచ్చని తెలిపారు. తద్వారా ప్రజలకు మరింత ఆరోగ్యవంతమైన ఆహార ఉత్పత్తులను అందించవచ్చని పేర్కొన్నారు. రైతులకు ప్రభుత్వం ఎల్లప్పుడు అండగా ఉంటుందని, పంట సాగులో రైతులకు అవసరమైన మెళుకువలను అందించి అధిక దిగుబడి సాధించేలా ప్రోత్సహిస్తుందని తెలిపారు. పదేళ్ల పాటు ప్రకృతి వ్యవసాయ సాగు చేయడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలోని హాజీపూర్ మండలం గుడిపేట రైతు వేదిక నుంచి జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి సురేఖ, ప్రకృతి వ్యవసాయ రైతు కొట్టే రవీందర్, అధికారులతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని 15 రైతు వేదికల్లో 1,875 మందితో వీడియో కాన్ఫరెన్స్ మీటింగ్ నిర్వహించడం జరిగిందని తెలిపారు. ప్రకృతి వ్యవసాయ పథకం పురోగతి దిశగా జిల్లాలో చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. అనంతరం రైతులకు ప్రకృతి వ్యవసాయ కిట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల ఆత్మ చైర్మన్ సింగతి మురళీ, కార్పొరేటర్లు రాజన్న, బియ్యాల త్రివేణి, కమల, లగిశెట్టి రాజయ్య, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# పులిగుండాల ప్రాజెక్టు నుంచి రైతులకు నీటి విడుదల చేయాలి



**ఉద్యమ కెరటం, ఖమ్మం:** పులిగుండాల ప్రాజెక్టు నుంచి రైతులకు నీటి విడుదల చేయాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. ఖమ్మం జిల్లా పెనుబల్లి మండలం పరిధిలోని పులిగుండాల ప్రాజెక్టు కింద బ్రహ్మలకుంట గ్రామం సహా పరిసర ప్రాంతాల్లో పంటలు ఎండిపోతున్నాయన్న రైతుల విజ్ఞప్తిపై ప్రాజెక్టు నుంచి సాగునీటి విడుదలలో ఉన్న అడ్డంకులను వెంటనే తొలగించి వెయ్యి ఎకరాలకు నీరు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రాజెక్టు పరిస్థితులపై మంత్రి సమగ్ర సమీక్ష నిర్వహించి, నీటి విడుదలలో ఉన్న సాంకేతిక, పరిపాలనా సమస్యలను గుర్తించి రెవెన్యూ, అటవీ శాఖల సమన్వయంతో వెంటనే పరిష్కరించాలని పేర్కొన్నారు. సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, డీఎఫ్ఓ సిద్ధార్థతో ఫోన్‌లో మాట్లాడి, సమస్యలు తలెత్తితే తక్షణమే పరిష్కరించాలని ఆదేశించారు. నీటిపారుదల శాఖ అధికారులు యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టి నీటి విడుదలను వేగవంతం చేయాలన్నారు. రైతుల ప్రయోజనాలే ప్రథమ ప్రాధాన్యమని, పంటలను కాపాడటం ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. మంత్రి ఆదేశాల నేపథ్యంలో అధికారులు త్వరలోనే నీటి విడుదల ప్రక్రియను ప్రారంభిస్తారని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

# ఇఫ్తార్ విందులో మట్టా దయానంద్



**ఉద్యమ కెరటం, సత్తుపల్లి:** రంజాన్ పండుగ సందర్భంగా సత్తుపల్లి పట్టణంలోని పెద్ద మసీద్‌లో మంగళవారం నిర్వహించిన ఇఫ్తార్ విందులో రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా సత్తుపల్లి నియోజకవర్గ ప్రజలకు ముందస్తుగా రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. పట్టణం, మండలంలోని ముస్లిం సోదరులతో కలిసి ప్రార్థనల్లో పాల్గొన్నారు. అనంతరం ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. సోదరభావంతో కలిసి జరుపుకున్న ఈ కార్యక్రమం ఆత్మీయ వాతావరణంలో కొనసాగింది. ఈ కార్యక్రమంలో సత్తుపల్లి మున్సిపల్ చైర్మన్ రిహానా బేగం కమల్ పాషా, వైస్ చైర్మన్ బొంతు సుమలత, ముస్లిం కౌన్సిలర్లు, పట్టణ కౌన్సిలర్లు, సత్తుపల్లి పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గాదె చెన్నారావు, ముస్లిం సోదరులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఉపాధి హామీ పనులపై ప్రజావేదిక




**ఉద్యమ కెరటం, జైనూర్:** జైనూర్ మండల కేంద్రంలో మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ 15వ సామాజిక తనిఖీల నివేదికలపై మంగళవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో ప్రజావేదిక నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ విశ్వనాథ్ రావు పాల్గొని ఉపాధిహామీ పనులు జరుగుతున్న ప్రదేశాల్లో సూచిక బోర్డులు ఖచ్చితంగా ఏర్పాటు చేయాలని, జాబ్ కార్డు కలిగిన ప్రతిఒక్కరికి పనులు కల్పించాలని సూచించారు. అలాగే సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు, మండల అధికారులు సమన్వయంతో పనిచేస్తే గ్రామ పంచాయతీ అభివృద్ధి చెందుతుందని అన్నారు. ఈ సమావేశంలో జిల్లా పీడీ, జెడ్పీ సీఈఓ దత్తరామ్, వాటర్ షెడ్ ప్రాజెక్ట్ అధికారి, మండల అధికారులు, సర్పంచులు, ఫీల్డ్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

# ఉచిత కూరగాయల కిట్ల పంపిణీ



**ఉద్యమ కెరటం, నేరడిగొండ:** మండల కేంద్రంలోని రైతు వేదికలో ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో ఉచిత కూరగాయల మినీ కిట్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బోథ్ బ్లాక్ ఆత్మ చైర్మన్ గొర్ల రాజు యాదవ్ ముఖ్య అతిథిగా హాజరై లబ్ధిదారులకు కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు స్వయంగా కూరగాయలు సాగు చేసుకునేలా ప్రోత్సహించడమే ప్రభుత్వ ఉద్దేశమని తెలిపారు. ప్రతి కుటుంబం ఇంటి వద్ద తోటలను ఏర్పాటు చేసుకోవడం ద్వారా ఆరోగ్యకరమైన ఆహారం అందుబాటులోకి రావడంతో పాటు ఖర్చులు తగ్గుతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రోల్ మామడ సర్పంచ్ తొడసం శంకర్, దర్బ తండా సర్పంచ్ ఆడే సీతారాం, ఆత్మ డైరెక్టర్లు కుంట శంకర్, అందు సింగ్, భాస్కర్ రెడ్డి, నియోజకవర్గ యువజన అధ్యక్షుడు బద్దం పోతారెడ్డి, యండి సద్దాం, వ్యవసాయ అధికారి కృష్ణవేణి, ఉద్యాన శాఖ అధికారి భూమయ్య, సౌజన్య, శ్యామ్ తదితరులు, రైతులు పాల్గొన్నారు.

